సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఆయా పోస్టుల ధ్రువపత్రాల పరిశీలన



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

మర్రిపాలెం: ఇటీవల అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను శుక్రవారం ఐసీడీఎస్ మర్రిపాలెం సీడీపీవో రమణకుమారి పరిశీలించారు. అర్బన్ పరిధిలో 12 ఆయా పోస్టులకు సంబంధించి 23 మంది దరఖాస్తు చేసుకోగా.. నాలుగు నిరాకరించామని, ఎంపికైన 19 మందికి కాల్ లెటర్లు అందజేశామని ఆమె తెలిపారు. ఎంపికైన వారు శనివారం ఉదయం 9 గంటలకు విశాఖ ఆర్డీవో కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి



ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గోపాలపట్నం: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బుచ్చిరాజుపాలెం బీజేపీ పశ్చిమ నియోజకవర్గం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పశ్చిమ కన్వీనర్ దాడి పురుషోత్తమ రమేష్, పార్టీ సీనియర్ నాయకుడు జీసీ నాయుడు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు ముఖర్జీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గొట్టివాడ వెంకటేశ్వరరావు, నగర కార్యదర్శి సీహెచ్ మంజుల, పల్లి మాధవీలత, కిలపర్తి సత్యనారాయణ, వలిరెడ్డి శ్రీనివాసరావు, దుర్గారావు, గణేష్, కామేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



చేతి బోరు నిర్మాణ పనులకు పూజ చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: వార్డులో ప్రజలకు మంచినీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నామని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. వార్డు పరిధి ఎన్టీఆర్ కాలనీలో చేతి బోరు ఏర్పాటుకు శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో మంచినీటి సమస్యలు, డ్రైనేజీ సమస్యలు లేకుండా చూస్తామన్నారు. వార్డును అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వార్డులో పలు అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించామని, త్వరలోనే పనులు పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు రఘు, బాబూరావు, అనంతలక్ష్మి, నక్కా లక్ష్మణరావు, రావాడ అప్పారావు, గ్రామాభివృద్ధి సంఘం నాయకులు చిన్నారావు, వర్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

'తల్లి ప్రేమతో అనాథ పిల్లల పెంపకం'

భీమునిపట్నం: అనాథ పిల్లలను తల్లిప్రేమతో పెంచి ప్రయోజకులను చేయడం ఎంతో గొప్ప విషయమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. స్థానిక ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో ఎస్‌వోఎస్ వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముందుగా ఎస్‌వోఎస్ వ్యవస్థాపకుడు హెర్మన్ మైనర్ చిత్రపటానికి అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడున్న పిల్లల సంరక్షణ ఎంతో బాగుందని కొనియాడారు. ఈ ఏడాది పదో తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
9398184202, 9912440606

అభివృద్ధి.. అద్భుతం

- అందంగా.. మౌలిక సదుపాయాలతో వార్డులు
- కనీస సౌకర్యాలు.. పార్కుల నిర్మాణంతో అంతా ఖుషీ

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత తమ ప్రాంతంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని పశ్చిమ ప్రజలు, నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ ఎన్నికలు జరగకపోవడం వల్ల ప్రత్యేక అధికారుల పాలన కొనసాగి అభివృద్ధి జరగలేదని చెబుతున్నారు. ఇప్పుడు తమ ప్రాంతంలో పార్కులు, రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు చేకూరినట్లు తెలియజేస్తున్నారు.



అభివృద్ధి జరిగిన తర్వాత శాంతినగర్ ప్రధాన రహదారి



గతంలో మర్రిపాలెం వుడా లేఅవుట్‌కు వెళ్లే రహదారి



మర్రిపాలెం వుడా లేఅవుట్‌కు వెళ్లే రహదారి ప్రస్తుతం ఇలా..

గోపాలపట్నం: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పలు వార్డుల్లో అభివృద్ధి పరుగులు తీస్తోంది. నాయకులు సైతం అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారు. ఇక్కడి 52వ వార్డులో కోట్ల రూపాయల నిధులు వెచ్చించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో కనీసం కార్పొరేషన్ ఎన్నికలు కూడా నిర్వహించలేదు. అంతా అధికారుల పాలనలోనే సాగింది. దీంతో అభివృద్ధి కొరవడిందని స్థానికులు చెబుతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత సంక్షేమం, అభివృద్ధి దిశగా సాగిపోతోంది. జీవీఎంసీ పరిధిలోని తెలుగుదేశం పార్టీ గెలిచిన వార్డుల్లో కూడా అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నారు. వార్డుల్లో రహదారులు, కాల్వలు, పార్కులు, శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తున్నారు.

52వ వార్డులో..

కరాసా హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి 2020లో రూ.19 లక్షలు వెచ్చించారు. ఈ పనులు పూర్తయ్యాయి. అలాగే కరాసాలోని ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధికి ఒక దఫా రూ. 16 లక్షలు, రెండో దఫా రూ. 12 లక్షలు వెచ్చించారు. అదే విధంగా కరాసా క్రిస్టియన్ శ్మశాన వాటిక అభివృద్ధికి రూ. 10 లక్షలు వెచ్చించారు. ఈ పనులు జరుగుతున్నాయి.

ఊపందుకున్న అభివృద్ధి పనులు

- శివశివాని పాఠశాలకు వెళ్లే రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఇందుకు రూ. 12 లక్షలు వెచ్చించారు.
- కరాసాలో రూ. 12.60 లక్షలతో చేపట్టిన సీసీ డ్రెయిన్లు, కల్వర్టు పనులు పూర్తయ్యాయి.
- మర్రిపాలెం వుడా లేఅవుట్-రామచంద్రమిషన్ రోడ్డు అభివృద్ధికి రూ.54 లక్షలు వెచ్చించారు. ఈ పనులు పూర్తయ్యాయి.
- మర్రిపాలెం వుడా లేఅవుట్ ప్రధాన డ్రెయిన్ నిర్మాణానికి రూ. 34 లక్షలు వెచ్చించారు. ఈ నిర్మాణం స్థానికులకు ఎంతో మేలు చేకూర్చింది.
- శాంతినగర్ కమ్యూనిటీ హాలు మరమ్మతులకు రూ.19 లక్షలు వెచ్చించారు.
- మర్రిపాలెం వుడా లేఅవుట్ జేఎన్ఎన్‌యూఆర్ఎం (రజక కాలనీ), గౌరీనగర్ ప్రాంతాల్లో ఇళ్ల మరమ్మతులకు రూ.14 లక్షలు వెచ్చించారు. మర్రిపాలెం వుడా లేఅవుట్ ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి ఫోరెన్సిక్ లాబ్ వరకు బీటీ రోడ్డు వేసేందుకు 42.50 లక్షలు వెచ్చించారు. ఈ పనులు పూర్తయ్యాయి.

అంతే కాకుండా శాంతినగర్ పార్క్, మరిపాలెం వుడా లేఅవుట్ పార్కులను అభివృద్ధి చేశారు. పార్కుల్లో ఓపెన్ జిమ్, పిల్లల ఆట వస్తువులు, పచ్చదనం వంటివి ఏర్పాటు చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. ఇంకా కొన్ని పనులు కొనసాగుతున్నాయి. ప్రధానంగా జాతీయ రహదారిలో ఉన్న గ్రీన్ బెల్టులను సుందరీకరించారు. వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేసి వాటిని ఆధునికీకరించారు.



అభివృద్ధి చేస్తున్న శాంతినగర్ పార్క్



పచ్చదనంతో కళకళలాడుతున్న పార్క్



మర్రిపాలెం వుడా లేఅవుట్ గ్రీన్ బెల్టులో వాకింగ్ ట్రాక్ సోయగం

సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంతో మేలు



హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



సమావేశంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్

మల్కాపురం : డిగ్రీలో చేరే విద్యార్థి నాలుగేళ్ల తర్వాత ఉద్యోగంతో బయటికి వెళ్లాలనే ఆలోచనతో సింగిల్ మేజర్ సబ్జెక్టు ప్రవేశపెట్టినట్లు మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ అన్నారు. కళాశాల ఆవరణలోని ఆడిటోరియంలో నాలుగేళ్ల డిగ్రీ కోర్సుపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ విద్యార్థికి సంపూర్ణ స్వేచ్ఛ అందించే విధంగా ఈ విధానం ఉందన్నారు. విద్యార్థి తనకు ఇష్టమైన సబ్జెక్ట్‌ను మేజర్ సబ్జెక్ట్‌గా చదవటం వలన ఆ విద్యార్థిలో సృజనాత్మకశక్తి పెరిగి అద్భుతాలు సృష్టిస్తారన్నారు. కళాశాల రాజనీతిశాస్త్ర అధ్యాపకురాలు వై.అనసూయాదేవి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్నత విద్యలో ఉన్న లోపాలను సరిదిద్దుతూ నూతన విద్యా విధానం అమల్లోకి వచ్చిందన్నారు. నాలుగేళ్లలో విద్యార్థి మొత్తం మేజర్ సబ్జెక్ట్‌కు సంబంధించి 21 పేపర్లు చదువుతాడని, ఆరు మైనర్ సబ్జెక్ట్ పేపర్లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

గాడి తప్పిన పారిశుధ్య నిర్వహణ!

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఊర్వశి కూడలి సుభాష్‌నగర్, తుమ్మడపాలెం పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పింది. సుభాష్‌నగర్ రైల్వే వంతెన సమీప రహదారుల్లో చెత్తాచెదారాలు పేరుకుపోతున్నాయి. తుప్పుపట్టిన వాహనాలు నెలలు తరబడి వదిలేయడంతో శానిటరీ సిబ్బంది చెత్తాచెదారాలు రోజుల తరబడి వదిలేస్తున్నారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్తాచెదారాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

ఎల్.నానాజీ, సుభాష్‌నగర్, ఊర్వశి కూడలి.



రైల్వే యార్డ్‌కు వెళ్లే సుభాష్‌నగర్ మార్గంలో చెత్తా చెదారాలు

చిన్న వర్షానికే ఇలా..

- అధ్వానంగా రహదారులు
- గెడ్డల్లో పూడికలతో అవస్థలు



ముంపునకు గురవుతున్న తోటవీధి రైల్వేట్రాక్ రహదారి ఇలా..



దుర్గానగర్ రహదారిలో సిమెంటు దిమ్మెలతో పూర్తిగా కప్పిన కాలువ

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి తోటవీధి, దుర్గానగర్, పల్లీవీధి, గొల్లకంచరపాలెం రైల్వేట్రాక్ రహదారి, గోకుల్‌నగర్ లోతట్టు ప్రాంతాల్లోని రహదారులు చిన్నపాటి వర్షాలకే మురుగుతో నిండుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న వారు ఇళ్ల నుంచి బయటికి రావడానికే ఇబ్బంది పడుతున్నారు. ఆ మార్గంలో ప్రయాణించాలంటే పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. శ్రీను కేటరింగ్స్‌కు చెందిన సిబ్బంది చెత్తచెదారాలను సమీప కాలువలు, గెడ్డల్లో వేయడంతో మురుగు ప్రవాహానికి ఇబ్బంది కలిగి, చెత్త రోడ్లపైకి వస్తోంది. గృహనిర్మాణ వ్యర్థాలు వేయడం, ఆయా యజమానులు కాలువలను పూర్తిగా సిమెంటు దిమ్మెలతో కప్పివేయడం సమస్యగా మారింది. దీంతో పాటు పారిశుధ్య సిబ్బంది కాలువలు, గెడ్డలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయక పోవడంతో, వర్షానికి మురుగు, చెత్త రోడ్డుపైకి వస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జోన్-5 ప్రజారోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో సమస్య ఏర్పడుతోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశీలించి, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

'జగనన్న సురక్ష'తో మెరుగైన సేవలు

గోపాలపట్నం: ప్రజలకు మెరుగైన సేవలందించాలని అందుకే మన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 90వ వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి తెలిపారు. 90వ వార్డులోని పలు సచివాలయాల్లో సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవాలన్నారు. కుల, ఆదాయ, జనన, మరణ వివాహ ధ్రువీకరణ పత్రాలు, మ్యూటేషన్ లావాదేవీలు, ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం వంటి సేవలు ఉచితంగా అందివ్వాలని సూచించారు. ఇందుకు వలంటీర్లు ఏం చేయాలనే అంశాన్ని వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.



సచివాలయంలో మాట్లాడుతున్న చుక్క ప్రసాదరెడ్డి

మందుబాబులకు జైలు

దొండపర్తి: మద్యం తాగి వాహనాలు నడిపే వారికి కోర్టు రెండు రోజుల పాటు జైలు శిక్షతో పాటు రూ.300 జరిమానా విధించింది. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ ఆదేశాల మేరకు పోలీసులు నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా చేపడుతున్నారు. ఇదే క్రమంలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిని పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు. దీంతో విశాఖ రెండో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ మందుబాబులకు జైలుశిక్షతో పాటు, జరిమానా విధించారు. గత ఏడాదిలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిని పోలీసులు రెగ్యులర్‌గా కోర్టులో హాజరుపరుస్తున్నారు. దీంతో వారు 2 నుంచి 5 రోజులు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తోంది. మద్యానికి దూరంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ సీపీఐ నిరసన

మల్కాపురం : డిజిటల్ మీటర్ల వలన అధిక విద్యుత్ చార్జీలు వస్తున్నాయని, ఈ సమస్యతో మధ్య తరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సీపీఐ విశాఖ జిల్లా నాయకుడు కాండ్రేగుల సత్యంజనేయ ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన చార్జీలను నిరసిస్తు సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మల్కాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సత్యంజనేయ మాట్లాడుతూ ఒక టీవీ, ఫ్రిజ్, రెండు ఫ్యాన్లు, మూడు లైట్లు ఉన్న ఇంటికి గతంలో రూ. 150 నుండి రూ. 2 వందలు విద్యుత్ బిల్లు వచ్చేదన్నారు. నేడు అదే ఇంటికి రూ. 8 వందల వరకు బిల్లు వస్తుందని ఆరోపించారు. పారిశ్రామిక ప్రాంతంలో చాలా ఇళ్లకు రూ. వెయ్యి నుండి రూ. ఐదు వేల వరకు బిల్లులు వచ్చాయని, ఆ బిల్లులు కట్టలేక వినియోగదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. అనంతరం సమస్యపై సబ్‌స్టేషన్ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడాల రాంబాబు, నూనెల సూరిబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ చార్జీలు తగ్గించాలని అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పలు రైళ్ల రద్దు, మరికొన్ని గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 24న హౌరా-తిరుపతి (22889) ఎక్స్‌ప్రెస్, హౌరా-ఎర్నాకుళం (22877) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 24, 25వ తేదీల్లో షాలిమార్-హైదరాబాద్ (18045) ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-షాలిమార్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 25న సంత్రగచ్చి-మంగుళూరు (22855) ఎక్స్‌ప్రెస్, హౌరా-పుదుచ్చేరి (12867) ఎక్స్‌ప్రెస్, తిరుపతి- హౌరా (22890) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 26న సికింద్రాబాద్-అగర్తలా (07030) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

- వాల్తేర్ డివిజన్ కేకే లైన్ పరిధిలో పలు రైళ్లను ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. విశాఖపట్నం-కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 25 నుంచి జూలై 1వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్-విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26 నుంచి జూలై 2వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 25 నుంచి జూలై 2వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 26 నుంచి జూలై 3వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ధనలక్ష్మి దేవి

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం ధనలక్ష్మి దేవి ఆలయంతో పాటు దుర్గానగర్‌లోని దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆషాడ మాసం పంచమి పురస్కరించుకుని ధనలక్ష్మి ఆలయ ప్రధాన అర్చకుడు శ్యామా ఆచార్యులు, దుర్గాదేవి ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ప్రసాద వితరణ చేశారు.

ఫిర్యాదులన్నీ అక్రమ నిర్మాణాలపైనే

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జీవీఎంసీలో నిర్వహించిన 'టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం'లో వచ్చిన ఫిర్యాదులన్నీ అక్రమ నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపైనే అందాయి. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ టౌన్‌ప్లానింగ్ ఫిర్యాదుల కోసం ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఓపెన్ ఫోరంలో 13 ఫిర్యాదులు వచ్చాయి. జోన్-3 నుంచి ఒకటి, జోన్-5 నుంచి ఆరు, జోన్-6 నుంచి మూడు, జోన్-8 నుంచి మూడు ఫిర్యాదులు అందాయి. పట్టణ ప్రణాళిక అధికారి సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీసీపీ నరేంద్రరెడ్డి, ఏసీపీలు పాల్గొన్నారు.

ఇలా ఫిర్యాదు చేయండి..

జీవీఎంసీ పరిధి 8 జోన్లలో ఎలాంటి అనధికార నిర్మాణాలు జరుగుతున్నా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలపైన, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎలాంటి ఫిర్యాదులు తెలపాలన్నా జీవీఎంసీ టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా తెలపవచ్చు. అలాగే జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సప్ నంబరు 8187897569 నంబరుకు ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదులో పూర్తి వివరాలు.. పేరు, డోరు నంబరు, వార్డు నంబరు, చిరునామా.. సమస్యతో కూడిన సమాచారాన్ని వాట్సప్‌కు పంపితే చర్యలు చేపట్టనున్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న పట్టణ ప్రణాళిక అధికారి సునీత

డ్రగ్స్ నివారణకు సమష్టిగా పని చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ తదితరులు

దొండపర్తి : మాదక ద్రవ్యాల నియంత్రణకు అన్ని వ్యవస్థలు సమష్టిగా పని చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ సూచించారు. డ్రగ్ ఫ్రీ అవగాహన కార్యక్రమ పోస్టర్‌ను సీపీ శుక్రవారం తన కార్యాలయంలో ఎస్ఈబీ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సమర్థవంతంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జిరావు, జాయింట్ డైరెక్టర్ బమ్మిడి శ్రీనివాసరావు, ఏఈఎస్ బి.శ్రీనాథుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'కు మండల స్పెషలాఫీసర్లు

దొండపర్తి: జగనన్న సురక్ష పర్యవేక్షణకు మండల స్పెషల్ ఆఫీసర్ల (ఎంఎస్‌వో)ను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 11 మండలాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం సక్రమంగా అమలయ్యే విధంగా 11 మంది ఎంఎస్‌వోలు పర్యవేక్షించనున్నారు. పద్మనాభంకు ఎన్‌హెచ్-16 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ఏ), భీమునిపట్నంకు ఆ డివిజన్ ఆర్డీవో, ఆనందపురానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(కేఆర్ఆర్‌సీ), విశాఖ రూరల్‌కు స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్ఏ), సీతమ్మధారకు జీవీఎంసీ శానిటేషన్ అండ్ రెవెన్యూ అడిషనల్ కమిషనర్, మహారాణిపేటకు జీవీఎంసీ ఏడీసీ జనరల్‌ను నియమించారు. అలాగే గోపాలపట్నంకు జీవీఎంసీ యూసీడీ పీడీ, ములగాడకు జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి, గాజువాకకు వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ ఆఫీసర్, పెదగంట్యాడకు జిల్లా సహకార శాఖాధికారి, పెందుర్తికి డీఆర్‌డీఏ పీడీకి బాధ్యతలు అప్పగించారు.

పోలీసుల అదుపులో ఫేక్ ఐడీ తయారీ ముఠా

అల్లిపురం: మహారాణిపేట పరిధి తాడివీధిలో లక్ష్మి అనే మహిళ సహా నలుగురు వ్యక్తులు బెయిల్, పూచీకత్తుల కోసం ప్రయత్నించే వారే లక్ష్యంగా ఫేక్ ఐడీలు, డాక్యుమెంట్లు తయారు చేసి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠాను నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకుని మహారాణిపేట పోలీసులకు అప్పగించారు. వారి వద్ద నుంచి కంప్యూటర్, స్కానర్, ప్రింటర్ స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు విజయవాడలో ఉన్నట్లు గుర్తించిన పోలీసుల బృందం ఒకటి అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని ఇంకా ఎంత మంది ఉన్నదీ తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్, సోలార్ ఎనర్జీ హోల్డింగ్స్, త్రీఎస్ బిజినెస్ ఇన్ఫో సర్వీసెస్, టీం లీజ్ యూనియన్ బ్యాంక్, ఆటోమోటివ్, వరుణ్ మోటర్స్, యాక్సిస్ బ్యాంక్, అపోలో ఫార్మసీ, పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 715 ఉద్యోగాలకు జరిగిన ఇంటర్వ్యూలకు 569 మంది అభ్యర్థులు హాజరైతే 428 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను వారు పరిశీలించారు. అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సి.హెచ్. సుబ్బిరెడ్డి, ఎ.సంగీత చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో ఆయా కంపెనీలు నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని సుబ్బిరెడ్డి తెలిపారు.

రిప్లై బహిరంగ ప్రకటన మరియు హెచ్చరిక ప్రకటన

మా క్లయింట్లు అయిన కంచరపాలెం మార్కెట్ వర్తకుల సంక్షేమ సంఘం రిజిస్టర్డ్ నెం. 575/89 సుమారుగా 150 మంది వర్తకుల తరపున వారి యొక్క అధ్యక్షులు వారు అయిన శ్రీమతి సూరాడ నూకరత్నం W/o సూరాడ రాజు, ఫిష్‌వెండర్, నివాసము: డో.నెం. 36-80-33, కొత్తవాడ వీధి, రెడ్డి కంచరపాలెం వాస్తవ్యులు, విశాఖపట్నం దరి, వారు మాకు ఇచ్చిన భోగట్టా మేరకు లోకులు యావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు వర్తకులు వారి పూర్వీకులు సుమారుగా 100 సం॥లు పైబడి నేటివరకు సదరు కంచరపాలెం మెయిన్‌రోడ్డును అనుకొనిఉన్న మరియు ప్రభుత్వ పాఠశాలకు అనుకొనిఉన్న 55 సెంట్లు ఖాళీ స్థలం సర్వే నెం. 12/2 నందు వారు చిరు వ్యాపారములు చేస్తూ జీవనం కొనసాగిస్తూ ఉన్నారు. కాగా సదరు కంచరపాలెం దరికి దగ్గరగా ఉన్న గవర కంచరపాలెం గ్రామ అభ్యుదయ సంఘం వారు సదరు స్థలమును ఎటువంటి హక్కుభుక్తములు లేనటువంటి శ్రీ మళ్ళ సూర్యనారాయణ గారి వద్దనుండి సదరు సంఘంవారిచే సృష్టించబడిన రిజిస్టర్‌కాని క్రయపత్రము తేది. 09-03-1970వ సం॥దిగా మా క్లయింట్లకు సదరు పత్రమును చూపించి, సదరు స్థలం వారిదే అని మభ్యపెట్టి, మా క్లయింట్ల యొక్క నిరక్షరాస్యతను వారియొక్క బలంగా భావించి, సదరు స్థలంనందు నాలుగు అంతస్థుల భవనంను నిర్మించి, సుమారు 2018వ సం॥ నుండి మా క్లయింట్లను వారి స్వాధీన అనుభవములో ఉన్న స్థలంలోనుండి వారందరినీ బలవంతంగా ఖాళీ చేయించే ప్రయత్నం చేయగా సదరు మా క్లయింట్లు సదరు విశాఖపట్నం అర్బన్ తహశీల్దారు వారు నుండి సమాచార హక్కుచట్టం ప్రకారంగా సదరు సర్వే నెం. 12/2 యొక్క SFA మరియు FMB కాపీని ఇప్పించవలసినదిగా కోరగా సదరు తహశీల్దారు వారు ఎల్.ఏ. 556/2022/RTI తేది. 08-07-2022 ద్వారా మా క్లయింట్లుకు SFAను ఇప్పించగా అందలి సర్వేనెం. 12/2 స్థలం సర్కారు పుంజ అని ఉండగా సదరు సర్కారు పుంజ అనే సంపుటిని మార్పుచేసి సదరు స్థలమును మళ్ళ సూర్యనారాయణ గారిదిగా సుమారులుగా 2000 సం॥లో నమోదు చేయగా, సదరు సర్కారు పుంజకు మరియు సదరు మళ్ళ సూర్యనారాయణ గార్కి ఎటువంటి సంబంధం లేదనిన్నీ, కాగా సదరు మళ్ళ సూర్యనారాయణ గారితో వ్రాయించబడినది అని చెప్పబడుతున్న సదరు రిజిస్ట్రీకాని క్రయపత్రంలో సదరు ఆస్తి వారియొక్క స్వార్జితముగా తప్పుగా వ్రాయించబడినది. సదరి రిజిస్ట్రీకాని క్రయపత్రంలో వారిచే వ్రాయించబడిన స్వార్జితమునకు సంబంధించిన ఎటువంటి పత్రములు తాలూక సంఖ్యలు, సంవత్సరము, నెల తెలియజేయబడనందున, సదరు స్థలమును అనుకొని సర్వే నెం. 12/2ను ప్రభుత్వ భూమిగా భావించి, సదరు ప్రభుత్వంవారు మున్సిపల్ స్కూల్‌ను నిర్మించియున్నారు. సదరు స్కూల్ సదరు కంచరపాలెం మార్కెట్‌కు దక్షిణభాగంగా ఉన్నదనిన్నీ, సదరు మార్కెట్ స్థలంకు ఉత్తర దిక్కున విశాఖపట్నం ట్రంక్ రోడ్డు కలిగి ఉన్నదనిన్నీ, సదరు కంచరపాలెం మార్కెట్‌ను పూర్ణామార్కెట్ తదుపరి పెద్ద మార్కెట్‌గా భావించి లోకులు యావన్మంది ఉపయోగించుకుంటున్నారనిన్నీ, కావున సదరు గవర కంచరపాలెం గ్రామ అభ్యుదయ సంఘంవారికి ఈ స్థలంకు ఎటువంటి సంబంధం లేకపోయినప్పటికీ వారు మా క్లయింట్లను ఖాళీ చేయమని దౌర్జన్యం చేయడంతో మా క్లయింట్లు ఇంజంక్షన్ ఉత్తర్వులు కోరుతూ OS 131/2022 మహారాజశ్రీ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టు నుండి వ్యాజ్యమును తీసుకొనిరాగా సదరు మా క్లయింట్లు సదరు సర్కారు పుంజను మార్పుచేస్తూ వ్రాయించబడిన SFA రికార్డును ప్రశ్నిస్తూ సదరు సర్కారు పుంజను Bona Vacantia చట్ట ప్రకారంగా (The Andhra Pradesh Escheats and Bona Vacantia Act 1974) గవర్నమెంట్‌వారిని స్వాధీనం పరచుకోమని మహారాజశ్రీ ఆర్.డి.ఒ., విశాఖపట్నం వారిని ఆర్.సి.నెం. 1355/2022 - LRDT/DT 14.4.2023 ను దఖలుపర్చుకొనగా సదరు మహారాజశ్రీ ఆర్.డి.ఒ. వారు తమచే పాస్‌చేసిన ఆర్డర్ ప్రకారంగా సదరు SFAను మార్పుచేసే అధికారంను The Settlement Officer alone is competent to issue necessary order అని తీర్పు చెప్తుతూ, సదరు తహశీల్దారు వారికిగానీ, సదరు ఆర్.డి.ఒ. వారికి గానీ ఇందునిమిత్తం అధికారం లేదని చెపుతూ మహారాజశ్రీ సుప్రీమ్ కోర్టువారు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు సదరు Mutation ప్రకారంగా ప్రభుత్వం వారు తమయొక్క ట్యాక్సులు పొందడంవరకే చెల్లుతుందని, తదుపరి సదరు ఆర్.డి.ఒ. గారు సదరు కంచరపాలెం వర్తకులు పెట్టుకున్న సదరు అర్జీని డిస్‌మిస్ చేయగా సదరు ఉత్తర్వులపైన మా క్లయింట్లు ARC 16/2023ను మహారాజశ్రీ జాయింట్ కలక్టర్ వారికి అపీలును దఖలు పర్చుకొనగా సదరు అపీల్ తేది. 01-07-2023 ఉండగా సదరు గవర కంచరపాలెం గ్రామ అభ్యుదయ సంఘంవారు ఆంధ్రజ్యోతి, సాక్షి మరియు ఈనాడు దినపత్రికలకు తేది. 18-06-2023న ప్రెస్‌నోట్ విడుదల చేయడం జరిగినది. ఈ ప్రెస్‌నోట్ ద్వారా మహారాజశ్రీ విశాఖపట్నం ఆర్.డి.ఒ. వారు సదరు స్థలమును వారిదే అని చెప్పి ఉత్తర్వులు ఇచ్చియున్నారనిన్నీ లోకులు యావన్మందిని తప్పుతోవ పట్టించబడినదని కావున మా క్లయింట్లు ఇచ్చిన భోగట్టామేరకు సదరు ఆర్.డి.ఒ. అటువంటి ఉత్తర్వులు ఏమియూ ఇవ్వలేదని, సదరు వివాదము మహారాజశ్రీ జాయింట్ కలెక్టర్, విశాఖపట్నం వారి పరిధిలో మరియు పైన తెలుపబడిన మహారాజశ్రీ సివిల్ కోర్టు పరిధిలో యున్నదనిన్నీ ఇందుమూలంగా లోకులు యావన్మందికి తెలియజేయడమైనది.

D.V.V.R. PRATAP & R. SARADA, Advocates
36-40-78, MAIN ROAD, MARRIPALEM, VISAKHAPATNAM.
Cell: 9848418166, 9676543471